బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

'రేవంత్ తర్వాతి రాజకీయ మజిలీ బీజేపీ'

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ తర్వాతి రాజకీయ మజిలీ బీజేపీయేనని అన్నారు. బీజేపీలో ఆయన తనబృందంతో చేరడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అంటే ఎందుకు భయమో అసలు కారణాన్ని రేవంత్‌రెడ్డి ఈ మధ్యనే తన సన్నిహితుల వద్ద బయటపెట్టుకున్నారని కేటీఆర్ అన్నారు. తాను పుట్టింది బీజేపీలోనేనని.. చివరికి బీజేపీలోనే తన రాజకీయం ప్రస్థానం ముగుస్తుందని ప్రధానమంత్రికి, అమిత్‌షాలకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. తాను కాషాయ జెండాతోనే ఏబీవీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని.. అదే జెండా కప్పుకొని చనిపోతానని మోదీతో చెప్పింది.. వాస్తవమా..? కాదా.. ? రేవంత్ చెప్పాలన్నారు. ఈ అంశంలో రేవంత్ ప్రజలకు క్లారిటీ ఇవ్వాల్సిందేనని కేటీఆర్ అన్నారు.

కోల్‌కతా ఘటనపై
కదం తొక్కిన వైద్యులు

దేశవ్యాప్తంగా 24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

బలగం టీవి,న్యూఢిల్లీ

కోల్‌కతాలో వైద్యురాలిపై దారుణంగా లైంగికదాడి, హత్య సంఘటనలపై దేశ వ్యాప్తంగా నిరసన జ్వాలలు గత కొన్ని రోజులుగా కమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) శనివారం దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చింది. దీంతో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సమ్మె పాటిస్తున్నారు. ఐఎంఎ 24 గంటల నిరసనకు దేశం లోని అనేక ప్రైవేట్ ఆస్పత్రులు కూడా మద్దతు ప్రకటించాయి.

హైదరాబాద్‌లో
తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు

- ఒలింపిక్స్ స్థాయి ప్రమాణాలతో స్పోర్ట్స్ అకాడమీ లు
- అథ్లెట్లకు శిక్షణలో కొరియన్ స్పోర్ట్స్ యూనివర్శిటీ సహకారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాలోచనలు



బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ(ఫోర్త్ సిటీ)లో నిర్మించే స్పోర్ట్స్ హబ్ లో దీన్ని ఏర్పాటు చేస్తారు.దాదాపు 12 వివిధ క్రీడల అకాడమీలను ఇందులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అంతర్జాతీయ స్థాయి అధునాతన మౌలిక సదుపాయాలు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ హబ్ లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తారు.

కొత్త గా స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీకి "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ" అనే పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనువైన స్థలంగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. సదరు క్యాంపస్ ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలుండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల దక్షిణ కొరియా పర్యటనలో కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ యూనివర్సిటీ గా ప్రత్యేకత చాటుకుంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా మొత్తం 32 పతకాలు మిగితా 3వ పేజీలో

ముడా లేఅవుట్ కేసులో
సిద్ధరామయ్యపై విచారణ

- కర్ణాటక సీఎంపై కేసు నమోదయ్యే అవకాశం
- రాజీనామా చేసే ప్రసక్తే లేదు : సీఎం సిద్ధ రామయ్య

బలగం టీవి, బెంగళూరు

ముడా లేఅవుట్ అవినీతి కేసులో కర్నాటక సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ గెహ్లోట్ అనుమతి ఇచ్చారు.ఈ నేపథ్యంలో.. శనివారం సాయంత్రం ప్రత్యేక క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేశారు. ముడా లేఅవుట్‌లో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి ఖరీదైన ప్లాట్లను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముడా లేఅవుట్‌లో ఎలా ఆమె ఓనర్ అయ్యారని ప్రశ్నలు ఉత్పన్నం అయ్యాయి. విచారణ కోసం గవర్నర్ గెహ్లోట్ క్లియరెన్స్ ఇవ్వడంతో.. సిద్ధరామయ్యపై కేసు బుక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సామాజిక కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ అభ్యర్థనల మేరకు విచారణ కోసం ఆదేశాలు ఇచ్చారు. భారతీయ నాగరికా సురక్షా సంహితలోని సెక్షన్ 17, సెక్షన్ 218 కింద విచారణకు గవర్నర్ అనుమతి ఇచ్చారు.

రాజీనామా చేసే ప్రసక్తే లేదని కర్నాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు. మైసూరు లేఅవుట్‌లో జరిగిన అవకతవకలపై సిద్ధరామయ్యపై ఆరోపణలు వచ్చాయి. తాను ఏమీ తప్పు చేయలేదని, అందుకే రాజీనామా చేయడం లేదని సిద్ధరామయ్య తెలిపారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగం, చట్టానికి వ్యతిరేకంగా ఉందన్నారు. కోర్టులో తనను విచారిస్తారని, ఆ సమస్యను న్యాయంగానే పోరాడనున్నట్లు సీఎం చెప్పారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేందుకు పెద్ద కుట్ర జరుగుతున్నట్లు సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు. బీజేపీ ఇలాంటి ట్రిక్కులు ప్లే చేస్తోందని, ఢిల్లీ.. జార్ఖండ్ రాష్ట్రాల్లో ఇలాగే జరిగిందన్నారు. కర్నాటకలో కూడా ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ, జేడీఎస్ ఈ కుట్రలో భాగస్వామ్యం అయినట్లు తెలుస్తోందన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ తనతో ఉన్నదని, క్యాబినెట్‌తో పాటు సర్కారు తనతోనే ఉన్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కూడా తన వైపే ఉన్నట్లు చెప్పారు. రాజ్‌భవన్‌ను ఓ రాజకీయ పావుగా వాడుతున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేతుల్లో గవర్నర్ ఓ తోలుబొమ్మలా వ్యవహరిస్తున్నట్లు సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు.

తొండిలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్

- సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్
- రుణమాఫీ పాక్షికంగా చేశామని, తప్పు అయిందని క్షమాపణ అడగాలి
- లేదా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి
- రైతుబంధు ఎగ్గొట్టారు
- రుణమాఫీ సంపూర్ణంగా అయిందో లేదో ఏ ఊరికైనా పోయి రైతులనే అడుగుదాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్ రావు



బలగం టీవి, హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి తొండి చేయడంలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్ అని బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు సెటైర్ వేశారు. ఈ రెండు విషయాల్లో ఆయన్ను కొట్టేవాడు లేరని విమర్శించారు. రుణమాఫీ చేయలేక చేతులెత్తేసినందుకు భేషరతుగా రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాలేదని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని.. రైతులు ధర్నా చేస్తున్నారని.. ప్రధాన ప్రతిపక్షంగా తాము సాక్ష్యాలతో చెబుతున్నామని అన్నారు. ఇంత జరుగుతున్నా కళ్లు, చెవులు, నోరులేనట్టుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిపాలనలో ఫ్లాఫ్ అని స్పష్టమవుతుందని అన్నారు. ఇవాళ రాష్ట్రంలో చూస్తే హాస్టళ్లలో ఎలుకలు కొరుకుతున్నాయి.. డెంగ్యూ మలేరియాతో ఆస్పత్రుల్లో మంచాలు దొరకట్లేవు.. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకెక్కింది.. అంత గందరగోళంగా మారిందని తెలిపారు.

రెండు విషయాల్లో మాత్రం రేవంత్ రెడ్డి టాప్ అని హరీశ్‌రావు అన్నారు. తొండి చేయడంలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్.. ఇందులో ఆయన్ను దాటేటోడు ఎవరు లేరని విమర్శించారు. రుణమాఫీ చేయలేక చేతులెత్తేసినందుకు రేవంత్ రెడ్డి భేషరతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చోర్ ఉల్టా కొత్వాల్‌కే డాంటే అన్నట్టుగా తానే రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీలో కోత.. మాటలేమో రోత అన్నట్టుగా రేవంత్ రెడ్డి వైఖరి ఉందన్నారు. బూతులు తిడితే రైతు రుణమాఫీ పూర్తవుతుందా? అని ప్రశ్నించారు. రంకెలు వేస్తే అంకెలు మారిపోవని, అబద్ధాలు నిజమైపోవని తెలిపారు. నీ తిట్లతో రైతుల ఖాతాలో కోట్ల రూపాయలు పడవని స్పష్టం చేశారు. మమ్మల్ని తిట్లు తిడతవు కావచ్చు కానీ దేవుడి మీద పెట్టిన ఒట్లు ఎట్ల మరిచిపోతావని ప్రశ్నించారు.

పాలకుడిగా రేవంత్ రెడ్డి పాపాలు మూటగట్టుకున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. పాలకులు పాపం చేస్తే రాష్ట్రానికి లత్త కొడుతుందని ప్రజలు భయపడుతుందని తెలిపారు. రేవంత్ రెడ్డిగా ప్రమాణం చేస్తే తమకు ఇబ్బంది లేదని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి దేవుళ్లను మోసం చేశావని అన్నారు. రైతులకు తీరని ద్రోహం చేశావు.. దేవుళ్లకు తీరని అపచారం చేశావని మండిపడ్డారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి, మాట తప్పిన పాపం ఊరికే పోదని అన్నారు. అది రాష్ట్రానికి చుట్టుకుంటుందేమోనని దేవుణ్ని నమ్మేవాళ్లు భయపడుతున్నారని తెలిపారు. నీ పాపం ప్రజలకు శాపంగా మారకూడదనే.. ఆ దేవుళ్ల దగ్గరికే తానే వెళ్తానని చెప్పారు. ఈ రాష్ట్ర ప్రజలకు కీడు జరగవద్దని దేవుళ్లను కోరుకుంటా అని అన్నారు. అన్ని దేవాలయాలకు వెళ్తా.. మెదక్ చర్చికి వెళ్తా.. జహంగీర్‌పీర్ దర్గాకు వెళ్తా అని తెలిపారు. ఈ పాపాత్ముడు రైతులను మోసం చేసిండు.. నిన్ను మోసం చేసిండు.. కానీ ఈ పాపాత్ముడు వేసిన పాపానికి ప్రజలను శిక్షించకు అని వేడుకుంటా అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి దొంగే దొంగ అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంఎల్ఎ టి.హరీశ్ రావు విమర్శించారు. రుణమాఫీకి ఎగనామం పెట్టి మొత్తం రుణమాఫీ చేసినట్లు ఫోజులు కొడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, సిఎం వ్యవహారశైలి ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. రుణమాఫీ పాక్షికంగా చేశారంటే సరే కానీ మొత్తం చేశామంటే మాత్రం అంగీకరించేది లేదని పేర్కొన్నారు. మిగితా 3వ పేజీలో

లైంగికదాడులపై
మహిళా కమిషన్ ఎందుకు స్పందించలేదు

- మహిళా ఎమ్మెల్యేలను సీఎం అవమానిస్తే ఎటుపోయింది?
- మాజీమంత్రులు సబిత, సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతి

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు, హత్యలు జరుగుతుంటే మహిళా కమిషన్ ఎందుకు స్పందించలేదని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అవమానపర్చినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తన ప్రసంగంలో దొర్లిన పొరపాటుకు కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ కూడా చెప్పారని, అయినా మహిళా కమిషన్ నోటీసులు ఇవ్వటం ఏమిటని అన్నారు.శనివారం తెలంగాణభవన్‌లో మాజీమంత్రులు సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ముక్తవరం సుశీలారెడ్డితో కలిసి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. హుందాతనంతో క్షమాపణ చెప్పిన కేటీఆర్‌ను మహిళాలోకం స్వాగతిస్తున్నదని.. అయినా కొందరు మహి ళా నేతలు ఏదేదో మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇద్దరు మహిళా మంత్రు లు, మహిళా కమిషన్ వేగంగా స్పందించారని.. 8 నెలల్లో మహిళలపై 1,800 లైంగిక దాడులు, హత్యలు జరిగితే ఎందుకు స్పందించలేదని నిలదీశారు.

లైంగికదాడికి గురైన ఒక్క మహిళనైనా పరామర్శించారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం తమను అనకూడని మాటలంటే ఈ మహిళా కమిషన్, మంత్రులు ఎకడికి వెళ్లారని కడిగిపారేశారు. కేటీఆర్‌కు కేసీఆర్ సంసారం నేర్పారు కాబట్టే క్షమాపణ చెప్పారని, సీఎం రేవంత్‌కు ఎవరూ సంసారం నేర్పినట్లు లేరని చురకలంటించారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా డీకే అరుణకు కేటీఆర్‌తో కేసీఆర్ క్షమాపణ చెప్పించారని.. ఇది తమ సంసారమని అన్నారు.

హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నామ న్నారు. సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అ సెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పైచేయి సాధించటంలో కేటీఆర్, హరీశ్‌రావు పాత్ర ప్రముఖంగా ఉన్నదని.. అందుకే వారిని సీఎం, కాం గ్రెస్ నేతలు టార్గెట్ చేస్తున్నారన్నారు. హరీశ్‌రావు ఒత్తిడితోనే ఈ మాత్రం రుణమాఫీ అ య్యిందని స్పష్టంచేశారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సచివాలయం దగ్గర తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్ర హం పెట్టినపుడే మహిళలను కాంగ్రెస్ ప్రభు త్వం అవమానించిందన్నారు. మహిళలకు ఈ 8 నెలల్లో కాంగ్రెస్ చేసింది శూన్యమని విమర్శించారు. కొండా సురేఖ, సీతక్క కాంగ్రెస్ నుం చి రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. వాణీదేవి మాట్లాడుతూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు సీఎం క్షమాపణ చెప్పకుండా మిగతా విషయాలు మాట్లాడటం దండగ అన్నారు.

రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తాం

- వివరాలను కలెక్టర్లకు అందజేస్తామని..
- ఆ తర్వాత ప్రభుత్వానికి అందజేస్తాం : కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

గ్రామస్థాయిలో రుణాలు మాఫీ కాని రైతుల వివరాలు సేకరించి కలెక్టర్లకు అందజేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కేటీఆర్ శనివారం మీడియాతో మాట్లాడారు. సిద్దిపేట ఎమ్మెల్యే అధికారిక నివాసంపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం సొంత మీడియా ప్రతినిధులు కమలాసన్‌రెడ్డిలాంటి సీనియర్ అధికారిపై దాడి చేసినంత పని చేశారన్నారు. ఓ వైపు సీఎం అధికారిక మీడియా నేమో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులపై దాడి చేస్తుంది.. మరోవైపు సీఎం, ప్రభుత్వమేమో ప్రభుత్వ ఆస్తులపైనే దాడి చేస్తుందని విమర్శించారు.

రాష్ట్రంలో రుణమాఫీకి 47లక్షల మందికి రుణమాఫీ కావాలని ఎస్ఎల్బీసీ చెప్పింది.. రుణ మాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరమవుతుందని రేవంత్ రెడ్డి చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. రూ.31వేల కోట్లు అంటూ కేబినెట్ ఆమోదించిందని.. రూ.26వేల కోట్లంటూ బడ్జెట్ ఆమోదించిందని.. చివరకు రూ.17వేల కోట్లతో రుణమాఫీ అన్నారన్నారు. కేవలం 22లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. గ్రామస్థాయిలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తామని.. వివరాలను కలెక్టర్లకు మిగితా 3వ పేజీలో

టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ భవనంలో అగ్నిప్రమాదం

- కీలక ఫైల్స్ దగ్ధం

బలగం టీవి, తిరుపతి

తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. ప్రమాదంలో టీటీడీ పరిధిలోని స్థానిక ఆలయాలకు సంబంధించిన ఇంజినీరింగ్ దస్త్రాలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్న భోజన విరామసమయంలో అగ్నిప్రమాదం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాద ఘటనపై విభాగంలో ఉన్న ఉద్యోగి నాగార్జున పరిపాలనా భవనంలోని కంట్రోల్‌రూంకు సమాచారమిచ్చారు. కంట్రోల్ రూం సిబ్బంది అగ్నిమాపకశాఖకు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాపక విభాగ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. మంటలు తక్కువస్థాయిలో ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి టీటీడీ సిబ్బంది మంటలను అర్పివేశారు.

ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ఇంజినీర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్రకోణం ఉందా? అనే అంశంపై టీటీడీ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అగ్ని ప్రమాదం జరిగిన పరిపాలన భవనం ఇంజనీరింగ్ సెక్షన్ ను టీటీడీ నిఘా, భద్రతా విభాగ ముఖ్య అధికారి శ్రీధర్ పరిశీలించారు.అనంతరం సీవీఎస్ఓ మీడియాతో మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో టీటీడీ పరిధిలోని పలు ఆలయాలు, రహదారులకు సంబంధించి దస్త్రాలు తగులపడినట్లు గుర్తించామన్నారు. ప్రమాదంలో దస్త్రాలు తగులపడినా ఈ ఫైలింగ్ ఉండటంతో డేటా అందుబాటులో ఉంటుందంటున్నారు. అగ్ని ప్రమాదం ఘటనపై విచారణ చేస్తున్నామన్నారు.మదనపల్లె దస్త్రాల దహనం కేసు.. ఇటీవలే అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన తెలిసిందే. మంటలు వ్యాపించి 22ఏ భూములకు సంబంధించి వివరాలు ఉన్న కంప్యూటర్లు, ఫైల్స్ ఖాళీ బూడిద కావడంతో కేసు నమోదు చేశారు. కుట్రకోణంలోనే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు వ్యాపించాయని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఆర్డీవోలు, సీనియర్ అసిస్టెంట్ మీద చర్యలు తీసుకుని ముగ్గురిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలోనే ఇవాళ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ధవళేశ్వరంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకంది. ఈ ఘటనలో పోలవరం ఎడమ కాలవకు సంబంధించిన నిర్వాసితుల వివరాలతో ఉన్న ఫైల్స్ మంటల్లో కాలిపోయాయనే వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అడవి భూమి సంరక్షణకు

అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి..

- పోడు పట్టాల దరఖాస్తుల స్థితిగతుల పై నివేదిక
- అర్హులకు పోడు పట్టాల అందించేందుకు పటిష్ట కార్యాచరణ..
- మంత్రి కొండా సురేఖ

బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :

కొత్తగా రాష్ట్రంలో ఇంచ్ అటవీ భూమి కూడా సాగు చేయడానికి వీలు లేదని, అటవీ భూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎక్కడా కూడా నూతన ఆక్రమణలు జరగడానికి వీలులేదని రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ అన్నారు.శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర అటవీ , పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తో కలిసి పోడు భూముల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

రాష్ట్రంలో అటవీ భూముల విస్తీర్ణం, ఆర్ఓఎఫ్ఆర్ చట్టం, జారీ చేసిన పోడు భూముల పట్టాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు మొదలగు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నత అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఆమోదించిన ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారునికి చేరాయో లేదో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. మన రాష్ట్రంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సాగు జరుగుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదిక అటవీశాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

పోడు భూముల పట్టా కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టా పంపిణీకి చర్యలు తీసుకోవాలని, సదరు దరఖాస్తును తిరస్కరించే పక్షంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ నివేదిక అందించాలని అన్నారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం గతం నుంచి సాగు చేసుకుంటున్నా అటవీ భూములకు మాత్రమే పట్టాలు అందించాలని అన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్. చట్టం పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర గిరిజనులకు,ఆదివాసీలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని, వలస వచ్చి నూతనంగా అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేత చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించాలని అన్నారు .రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ గిరిజనులకు అటవీ శాఖ వ్యతిరేకం అనే భావన తొలగించే విధంగా పని చేయాలని అన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అటవీ భూములు చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలనిఅన్నారు .

పెండింగ్ పోడు భూముల పట్టా దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని,ఆర్ఓఎఫ్ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేయాలని అన్నారు.అటవీ భూముల అనుమతుల కారణంగా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డు సౌకర్యం, త్రాగు నీరు , ఆసుపత్రి వంటి మౌలిక వసతుల కల్పన పనులకు అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఫాలో అప్ చేయాలని అన్నారు .పట్టాలు మంజూరు చేసిన పోడు భూములలో రైతులు పామ్ ఆయిల్, జీడి మామిడి తోటలు మొదలగు లాభదాయక పంటలు సాగు చేసేలా రైతులకు అవసరమైన సహకారాలు, సూచనలు అందించాలని అన్నరు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోడు భూముల పట్టా కోసం 507 దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పిస్తే కేవలం 27 మందికే పట్టాలు వచ్చాయని , మిగిలిన లబ్ధిదారులకు కూడా పట్టాలు అందేలా చూడాలని మంత్రిని కోరారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట చెందుర్తి , గంభీరావు పేట, రుద్రంగి, కోనారావుపేట, ఎల్లారెడ్డి పేట, మండలాల్లోని గిరిజనులకు పోడు పట్టాలు రాలేదని, వీరి దరఖాస్తులను మరోసారి క్షేత్రస్థాయిలో రీ సర్వే నిర్వహించి పట్టాలు పంపిణీ చేయాలని అన్నారు.

వేములవాడ నియోజకవర్గం పరిధిలో మోత్కురావుపేట ,చందుర్తి రోడ్డు పనులు అటవీ అనుమతుల కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ఖానాపూర్ నుంచి హైదరాబాదుకు వయ రాయికల్ వెళ్ళడానికి 35 కిలోమీటర్లు మేర ప్రయాణం బారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అటవీ ప్రాంతంలో 3.5 కిలోమీటర్లు వేసేందుకు అవసరమైన అనుమతులు త్వరగా అందేలా చూడాలని అన్నారు . ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి ,జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జనార్ధన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పోటీ పరీక్షల్లో

విజయం సాధించేలా సిద్ధం చేయాలి

- విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :

విద్యార్థులను పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా సిద్ధం చేయాలని, ఇంగ్లీష్, మ్యాథ్స్ ఇతర సబ్జెక్టుల్లో రాణించేలా తయారు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శనివారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాల్ ను పరిశీలించారు. విద్యాలయంలో ఎందరు విద్యార్థులు చదువుతున్నారని అడగగా, 248 మంది విద్యార్థులు ఉన్నారని, 35 మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారని ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు.

అనంతరం మెనూను పరిశీలించి, కిచెన్ లో సిద్ధం చేస్తున్న అన్నం, కూర ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి ఫ్యాన్లు, విద్యుత్ దీపాల పనితీరును పరిశీలించారు. పలువురు విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. వారికి పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టి,విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని టీచర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, విద్యాలయం టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:

ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికి లైసెన్స్ కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మేళ ఏర్పాటు చేసి రుద్రంగి ,వీర్నపల్లి మండల పోలీస్ స్టేషన్ల పరిధిలోని యువతి యువకులకు అవగాహన కల్పించి, అర్హత సాధించిన 72 మందికి డ్రైవింగ్ టెస్ట్ పెట్టి అర్హత సాధించిన వారికి శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , ఎస్పీ అఖిల్ మహాజన్,రవాణా శాఖ అధికారులతో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లైసెన్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక స్పృహతో మంచి కార్యక్రమానికి నాంది పలికారని, శాంతి భద్రతలతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ జిల్లా పోలీసులు విశేష కృషి చేస్తున్నారని అన్నారు.జిల్లా పోలీస్ శాఖ గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో శాంతి భద్రతలను కాపాడుతునే విన్నూత కార్యక మాలతో ప్రజలకు చేరువ అవుతున్నారన్నారు. డ్రైవింగ్ వచ్చి అర్హులైన వారందరూ కచ్చితంగా డ్రైవ్ లైసెన్స్ తీసుకోవాలని,ప్రమాదాలు జరిగిన సందర్భలలో మొదటగా అడిగేది లైసెన్స్ అని , ప్రమాదాలు జరిగిన సమయాల్లో లైసెన్స్ కలిగి ఉండటం వలన ప్రమాద భీమా లాంటివి వర్తిస్తాయని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడాతూ జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ రోడ్డు ప్రమాదాలు నివారణ కొరకు తీసుకుంటున్న చర్యల పట్ల జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అభినందించారు.అంతే కాక లైసెన్స్ మేళ కార్యక్రమంలో భాగంగా ఐడీటీఆర్ సేవలను కూడా ఉపయోగిం చుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న యువత స్వయం ఉపాధి వైపు వెళ్లాలని ప్రభుత్వ తోడ్పాటు కూడా అర్హులందరికీ ఉంటుందని అన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో వాహనాల తనిఖీ సమయాల్లో అధిక సంఖ్యలో వాహన దారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని అన్నారు.లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని, జిల్లాలో లైసెన్స్ తీసుకోవడానికి చాలా మంది వాహనదారులు పడుతున్న ఇబ్బందులు, అవగాహన లేమి అంశాలను పరిగణనలోకి తీసుకొని పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్ణిత రుసుముతో దశల వారిగా లైసెన్స్ మేళ నిర్వహించి లైసెన్స్ లు అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, డీటీఓ లక్ష్మణ్ ,సిఐ లు ,ఎస్ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక రైతుబంధు ఇచ్చి

పదేళ్లపాటు రైతులను ఎండబెట్టిర్రు..

- దేశ చరిత్రలోనే రుణ మాఫీ ఓ కొత్త రికార్డు..
- రుణమాఫీ పైన బీఆర్ఎస్ పార్టీది అక్కసు మాత్రమే..
- రైతులను కావాలనే హరీశ్‌రావు, కేటీఆర్ రెచ్చగొడుతున్నారు..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...

బలగం టీవీ , వేములవాడ

రుణమాఫీ పైన బీఆర్ఎస్ పార్టీది అక్కసు మాత్రమే అని,రైతులను కావాలనే హరీశ్‌రావు ,కేటీఆర్ రెచ్చగొడుతున్నారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం పత్రిక ప్రకటన విడుదల చేసారు..

తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని,ఆగస్ట్ 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసి చూపించారని అన్నారు.. ప్రభుత్వం 32.50 లక్షల మంది రైతులకు రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల నిధులు కేటాయించి, దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పిందని అన్నారు.జులై 15వ తేదీన రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం,మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టిందన్నారు..

జులై 18వ తేదీన మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న 11,50,193 మంది రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రూ.6098.93 కోట్ల రుణమాఫీ చేసిందని,జులై 30వ తేదీన అసెంబ్లీ వేదికగా రెండో విడత 6,40,823 మంది రైతులకు రూ.6190.01 కోట్ల రుణమాఫీ కార్యక్రమం అమలు చేసి ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసిందన్నారు..

ఆగస్ట్ 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభ వేదికపై ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతులకు అసలైన స్వరాజ్యం వచ్చిందని.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు ప్రకటించారని అన్నారు..

రాష్ట్రంలోని మూడో విడత కింద 4,46,832 మంది రైతులకు రూ.5644.24 కోట్లరుణమాఫీ కార్యక్రమం అమలు చేసి,రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ అవుతాన్నాయిని, ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారని, దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం ముగియనుందన్నారు..కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారని అన్నారు..సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులను రోడ్లపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని,పదేళ్లలో కేసీఆర్ చేయలేని పని నెల రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసారని అన్నారు..

ప్రతి ఒక్కరికి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వమే స్వయంగా చర్యలు తీసుకుంటోందని,గతంలో బీఆర్ఎస్ లాగా రైతులకు మేం రుణమాఫీ ఎగ్గొట్టలేదని అన్నారు.రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులకు 8500 కోట్లు ఎగ్గొట్టిన బతుకులు మీవని,లక్ష రూపాయల రుణమాఫీ ఐదేళ్ల పాటు చేసిన చరిత్ర కూడా మీదన్నారు.సాక్షాత్తు రైతులకు సంకెళ్లు వేసి నడిపించిన నీచ చరిత్ర కేసీఆర్ ది,ఒక్క రైతు బంధు ఇచ్చి అన్నదాతలను పదేళ్ల పాటు ఎండబెట్టారని,రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ లను ఎత్తి వేసి రైతులను నాశనం చేశారని అన్నారు.

దళిత,పేద రైతుల, అసైన్డ్ భూములను లాక్కున్నారని,బడా బాబులకు రైతు బంధు పేరుతో 24 వేల కోట్లు దోచిపెట్టి,రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీ ఏ మాత్రంలేదు అని,అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో రైతులు కేసీఆర్ కుటుంబాన్ని ఛీ కొట్టారని,రుణమాఫీ పైన అసత్యాలు ప్రచారం చేస్తే అన్నదాతల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని అన్నారు.

రుణమాఫీ పైన కేటీఆర్, హరీష్‌రావు తో పాటు బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని,రైతులకు రుణమాఫీ కావడం వారికి ఇష్టం లేదు అని,కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు అవుతుంటే ,కేటీఆర్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాడని,మా ముఖ్యమంత్రి కదిలినా మెదిలినా బీఆర్ఎస్ గజగజ వణికిపోతోందన్నారు.ఎప్పుడైనా రైతులకు అండగా నిలబడింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని,భవిష్యత్తు లో కూడా రైతులకు వెన్నుదన్నుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉంటుందన్నారు.

ఉచిత విద్యుత్తు ను ఇస్తున్నాం,కావాల్సిన సబ్సిడీలను కొనసాగిస్తున్నాంమని,కౌలు రైతులకు రైతు భరోస్తా ఇస్తామని,రైతు కూలీలకు సాయం చేస్తామన్నారు.రైతుకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకొని తీరుతాం అని, రైతు పేరు చెప్తే మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుకు వచ్చేలా అన్నదాత కు అండగా ఉంటామన్నారు..

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల ఆహ్వానం

బలగం టీవీ , సిరిసిల్ల :

ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల నిమిత్తం 2024%-%25 విద్యా సంవత్సరం అందించే అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారిణి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.టోఫెల్, గ్రే, జిమ్యాట్, ఐఈఎల్‌టీఎస్ నందు ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. యూకే, యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులు ఆగస్టు 14 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు సంబంధిత ధ్రువపత్రాలతో www.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేములవాడ సుభాష్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులుగా కనికరపు రాకేష్...

బలగం టీవీ , వేములవాడ

వేములవాడ సుభాష్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులుగా వేములవాడ పట్టణానికి చెందిన కనికరపు రాకేష్ ను నియమించినట్లు సుభాష్ స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు చిలుక రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతు యువకులు మంచి శిక్షనిచ్చి అన్ని రంగాలలో ముందుకు తీసుకపోతామని అన్నారు.పేద విద్యార్థులకు చదువు కోవడానికీ సహకారం అందించడంతోపాటు ఆటలలో నైపుణ్యం ఉన్న వారికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు.

పేదవాడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్
- గోరంటాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బలగం టీవీ, గంభీరావుపేట :

ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. శనివారం గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపించేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి విద్యా వైద్యం చాలా ముఖ్యమైనవని,అనారోగ్య బారినపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది, ఆర్థికంగా వెనుకబడిన పేదవారికి అండగా నిలబడడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సహాయ నిధి నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు చెక్కులు మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని మరుగున పడేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవలను రెండు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచిందని ఆరోగ్యశ్రీలో ఇదివరకు లేని 160 కి పైగా కొత్త రోగాలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలను అందించాలని ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు. చెక్కులు మంజూరు కావడంలో కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్, కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు అంజా గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు వర(ప్రసాద్, అనిల్ గౌడ్,అస్లాం,పిఎసిఎస్ డైరెక్టర్ అంజిరెడ్డి మాజీ ఎంపిటిసి పర్శరాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంత్రి అంజయ్య, పిట్ల వెంకటి మహమ్మద్,ఆజాద్, పెద్దూరి విట్టల్ గౌడ్,సోను తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో లేడీ డాక్టర్ పై జరిగిన ఘటన బాధాకరం..

- ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు..
- ఘటనకు నిరసనగా విద్యార్థుల మానవహారం....

బలగం టీవీ ,రుద్రంగి:

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ హై స్కూల్ విద్యార్థులు ఈ నెల 9 న పచ్చిమ బెంగాల్ లో లేడీ డాక్టర్ (మోమిత దెబ్నత్)పై జరిగిన లైంగికదాడి, హత్యకు నిరసనగా శనివారం స్థానిక ఇందిరా చౌక్ లో మానవహారం నిర్వహించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర భారతవని లో మహిళలకు రక్షణ కరువైందని, ఓ రెండు రోజుల ముందు స్వాతంత్ర్యదినోత్సము, మరో రెండు రోజుల్లో రాఖీ పండుగ ఉన్నందున ఇలాంటి సమయంలో ఈ ఘటన జరగడం చాలా బాధాకరమైన విషయమని, ఇలాంటి ఘటన మళ్లి పునావరావృతం కాకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సునీల్, విజయ్ ,రమేష్, విజయ్ చందర్, రవి, రాజేశ్వరి, దశీల మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దోస్తులంటే ఇలా ఉండాలి..

- స్నేహితుడి వైద్యం కోసం రూ. 36,500 అందజేత

బలగం టీవీ, గంభీరావుపేట

స్నేహితులు అంటే కలిసి సరదాగా తిరగడమే కాదు.. ఆపదలో ఉన్న మిత్రుడిని ఆదుకోవడమూ అని నిరూపించారు వీరు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కందుకూల నవీన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో, హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు.పేద కుటుంబం కావడం.. తమ మిత్రుడికి కష్టం వచ్చిందని తెలియగానే అతని కోసం ఏదైనా చేయాలనుకున్నారు. పదో తరగతి(2012-13) మిత్ర బృందం కలిసి వారి వాట్సప్ గ్రూప్లో సహాయం కోసం మెసేజ్ పెట్టారు. తలో కొంత ఎవరికి తోచిన విధంగా వారు డబ్బులు జమ చేశారు. జమ చేసిన రూ 36,500 వేలు హైదరాబాద్ లో నవీన్ తల్లికి అందజేశారు.

అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం రండి...

బలగం టీవీ , సిరిసిల్ల

బాల సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్ బాల సాహిత్య రజతోత్సవం సందర్భంగా పత్తిపాక ఫౌండేషన్ సిరిసిల్ల, గరి పెల్లి ట్రస్ట్ భీముని మల్లారెడ్డిపేట మరియు మ్యాజిక్ చాప్లిన్ చొక్కాపు వెంకటరమణ సారధ్యంలో సిరిసిల్ల పట్టణంలోని శివానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు సృజనాత్మక రచనా శిల్ప శాల అవగాహన సదస్సు నిర్వహించారు. అవ్వ తాతలకు ఉత్తరాలు రాద్దాం రండి శీర్షికతో విద్యార్థులు అవ్వ తాతలకు ఉత్తరాలు రాసి, పోస్ట్ చేశారు. సృజనాత్మకతతో ఉత్తరాలు రాసిన విద్యార్థులకు ప్రథమ ద్వితీయ బహుమతులతో పాటు, లేఖ రచన చేసిన విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ లేఖ రచనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత , భాష పట్ల అభిమానం అలవడుతుందని ప్రధాన ఉపాధ్యాయులు ఎల్ మోతిలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సమ్మయ్య,శ్రీనివాస్ రెడ్డి, రాములు,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సూడాన్‌లో పారామిలటరీ దళాల కాల్పులు

- 80 మంది మృతి

బలగం టీవీ, హైదరాబాద్

యుద్ధంతో ఛిన్నాభిన్నమైన సూడాన్‌లో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. సెంట్రల్ సూడాన్‌లోని సిన్నార్ రాష్ట్రంలో పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ జరిపిన కాల్పుల్లో సుమారు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు పారామిలటరీ బలగాలు యత్నించగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఆర్ఎస్ఎఫ్ కాల్పులు జరిపినట్లు స్థానిక మీడియా నివేదించింది.

'సెంట్రల్ సూడాన్‌లో గల సిన్నార్ రాష్ట్రంలోని జల్కిని గ్రామంపై ఆర్ఎస్ఎఫ్ బలగాలు గురిపెట్టాయి. గురువారం నుంచి గ్రామాన్ని చుట్టుముట్టి రక్తపాతం సృష్టించారు. గ్రామం నుంచి ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. దీన్ని స్థానికులు ప్రతిఘటించారు. ఈ ఘటన మరణకాండకు దారితీసింది. ఆర్ఎస్ఎఫ్ బలగాలు జరిపిన కాల్పుల్లో 80 మంది మరణించారు. చాలా మంది ప్రజలు గాయపడ్డారు' అని జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.

కాగా, గతేడాది జూన్ నుంచి రాజధాని నగరం సింగాతోసహా సిన్నార్ రాష్ట్రంలోని పెద్ద భూభాగాలు ఆర్ఎస్ఎఫ్ బలగాల నియంత్రణలోనే ఉంటున్నాయి. ఇక తూర్పు సిన్నార్ ప్రాంతం సుడానీస్ సాయుధ దళాల నియంత్రణలో ఉంటోంది. అంతర్జాతీయ మైగ్రేషన్ సంస్థ ప్రకారం.. సిన్నార్ రాష్ట్రం నుంచి ఇప్పటి వరకూ దాదాపు 7.25 లక్షల మంది ప్రజలు వలస వెళ్లిపోయారు.

కాగా, సైన్యం, పారామిలిటరీ మధ్య గతేడాది ఏప్రిల్ 15న యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ఆధిపత్య పోరులో అనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం.. ఇప్పటి వరకూ ఈ యుద్ధం కారణంగా 16,650 మంది ప్రాణాలు కోల్పోగా.. వేల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. కోట్ల మంది ప్రజలు సూడాన్‌ను వదిలి వెళ్లిపోయారు. దాదాపు 2.2 మిలియన్ల మంది ప్రజలు పొరుగు దేశాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

సింగర్ సుశీలకు స్వల్ప అస్వస్థత..

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ గాయని పి.సుశీల అస్వస్థతకు గురయ్యారు. కడుపులో నొప్పితో ఆమె చైన్నైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. అయితే ఇప్పుడు సుశీల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కాగా, సుశీల 1950-1990 వరకు దక్షిణ భారతదేశంలో అత్యంత విజయవంతమైన గాయకురాలిగా ఎదిగారు. భారతీయ సినిమా రంగలో తనదైన ముద్ర వేశారు. ఇక ఆమెను 2008లో భారత ప్రభుత్వం ప్రద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. దీంతోపాటు సుశీల కెరీర్?లో ఐదు జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

గెలుచుకోగా, అందులో 16 పతకాలు కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన అథ్లెట్లు సాధించినవే కావడం గమనార్హం. ఈ యూనివర్సిటీలో శిక్షణ పొంది, పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించిన అథ్లెట్ లిమ్ సి-హైయోన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పర్యటన లో కలిసి అభినందించారు.

భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలు వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

శ్రీ మహా చండి యాగంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

బలగం టీవీ , సిరిసిల్ల :

సిరిసిల్ల పట్టణంలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి మార్కండేయ రుద్రయాగ పరస్పర నవ కుండాత్మక త్రయహ్నిక శ్రీ చండీ మహాయాగం లో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అందజేస్తామని.. ఆ తర్వాత ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

రెండురోజుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు మొదలుపెడుతామని.. ప్రతి ఒక్క రైతుకి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ప్రతి మంత్రి నియోజక వర్గం నుంచి మొదలుకొని ముఖ్యమంత్రి నియోజకవర్గం వరకు మొదట వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అప్పటికి కూడా రైతులకు న్యాయం జరగకుంటే ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడుతామన్నారు. తమ కాల్ సెంటర్‌కి దాదాపు 1.20లక్షల ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఒక ప్రొఫార్మా తయారు చేసి.. దాని ఆధారంగా సమాచారాన్ని సేకరిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కానీ, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు కానీ బాధ్యతలు తీసుకుంటారన్నారు.

గ్రామంలోని ప్రతి ఇంటికి బీఆర్ఎస్ శ్రేణులు వెళ్లి ఈ సమాచారాన్ని నేరుగా సేకరిస్తాయన్నారు. కనీసం 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. రైతులు అంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారని.. రైతు రుణమాఫీ విఫలమైన నేపథ్యంలో దాని నుంచి దృష్టి మళ్లించేలా అటెన్షన్ డైవర్షన్ కార్యక్రమాలను కాంగ్రెస్ చేస్తందని విమర్శించారు. సీఎం వందశాతం రుణమాఫీ పూర్తి అయిందని చెబుతుంటే.. ప్రభుత్వం రుణమాఫీ కానీ వాళ్ల కోసం ప్రత్యేక కౌంటర్లు పెట్టడం డొల్ల వైఖరికి నిదర్శనమన్నారు. ప్రభుత్వంలో ఉండి ప్రభుత్వ ఆస్తులపై దాడి చేయించడం దేనికి నిదర్శనమని నిలదీశారు. కేసీఆర్ గవర్నమెంట్ ఉన్న సమయంలో ఫాక్స్ కాన్ సంస్థ లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

రేవంత్ రెడ్డి మాటలు, పరిపాలన వైఫల్యం కారణంగా ఫాక్స్ కాన్ ఏమైనా వెనక్కి వెళ్లిపోయిందా..? 40వేలతో చైనా తర్వాత అతిపెద్ద రెండో క్యాంపస్‌ని బెంగళూరులో ఏర్పాటు చేస్తామని సంస్థ చెప్పటం దేనికి నిదర్శనం నిలదీశారు. ఫాక్స్ కాన్ పెట్టుబడులపైన, విస్తరణపై ప్రభుత్వం నిజనిజాలను బయటపెట్టాలని.. తదుపరి విస్తరణను ఫాక్స్ కాన్ సంస్థ చేస్తుందా ? లేదా ? సీఎం చెప్పాలన్నారు. సీఎం, రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడిన మాటలు, చేస్తున్న దుష్ప్రచారం కారణంగానే ఫాక్స్ కాన్ కంపెనీ బెంగళూరుకి పోయిందా ? అనిపిస్తుందన్నారు.

రుణమాఫీ కాని వారి కోసం స్పెషల్ డ్రైవ్..

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆగస్టు 15న విడుదల చేసిన మూడో విడతలో రూ.2 లక్షల రుణమాఫీ చేశారు. అయితే, రుణమాఫీ కాలేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారికి శుభవార్త అందించింది.అర్హత ఉన్నా.. రుణమాఫీ కోసం కాని రైతులకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఆధార్‌లో తప్పులుంటే.. ఆధార్‌కు బదు లుగా ఓటరు లేదా రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిగణనలోకి తీసుకో నున్నట్టు తెలిపింది. రేషన్ కార్డు లేకపోతే రైతుల కుటుంబాలకు సర్వే నిర్వహి స్తామన్నారు. బ్యాంక్ ఖాతాలో వ్యత్యాసాలను సరిచేయడానికి ఆధార్, పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. అసలు, వడ్డీ లెక్కలు సరిపోకపోతే ఇంటింటికీ వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తామని కాంగ్రెస్ పోస్ట్ చేసింది

తొండిలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీకి సంబంధించి పూర్తి వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం రైతుల సంఖ్య ఎంత, రుణమాఫీ అయిన రైతుల సంఖ్య ఎంతనో పూర్తి వివరాలు బయట పెట్టాలని అన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డికి హరీష్ రావు సవాల్

రుణమాఫీ సంపూర్ణంగా అయిందో లేదో రాష్ట్రంలోని ఏ ఊరికైనా పోయి నేరుగా రైతులనే అడుగుదామని సిఎంను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నిజంగా సంపూర్ణంగా రైతు రుణమాఫీ జరిగిందంటే.. ప్లేస్ చెప్పు.. టైమ్ చెప్పు.. ఏ జిల్లాకు పోదాం.. ఏ మండలానికి పోదాం.. ఏ గ్రామానికి పోదాం.. నా నియోజకవర్గానికి వస్తావా..? నీ నియోజకవర్గానికి పోదామా..? రాష్ట్రంలో ఎక్కడికి పోదామో నువ్వే డిసైడ్ చేయ్యి.. అక్కడికి వెళ్లి ఆ ఊరి రైతులను అడుగుదాం అంటూ ఖుల్లాం ఖుల్లా రుణమాఫీ అయ్యిందో లేదో తేల్చేద్దామని సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సవాలు విసిరారు. రుణమాఫీ పాక్షికంగా

చేశామని, తప్పు అయిందని క్షమాపణ అడగాలి లేదా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని అన్నారు. నోరు బిగ్గరగా చేసినంత మాత్రాన బిఆర్ఎస్ వదిలి పెట్టదని చెప్పారు.

కేబినెట్‌లో రూ. 31 వేల కోట్లు అన్నారు.. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు పెట్టారు % తీరా రూ.17,933 కోట్లు మాత్రమే ఇచ్చి 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. రూ.14 వేల కోట్లు కోత పెట్టి రుణమాఫీ పూర్తయ్యిందని అంటున్నారని విమర్శించారు. సిఎం నీది నోరా..? మోరా..? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతుల సంఖ్య 47 లక్షలు అని చెప్పి 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయలేదని.. ఇంకా సిగ్గులేకుండా రుణమాఫీ చేశామని సంకలు గుద్దుకుంటున్నారంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయిందని



అన్నారు. తాము రూ. 17 వేల కోట్లతో లక్ష రుణమాఫీ చేస్తే 36 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, కాంగ్రెస్ రూ.17 వేల కోట్లతో రుణమాఫీ పూర్తిగా ఎలా అవుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు.

రేవంత్ చరిత్ర ఏందో తన చరిత్ర ఏందో ప్రజలకు తెలుసు అని, మాట తప్పే చరిత్ర ఆయనదని హరీశ్‌రావు అన్నారు. కొడంగల్‌లో ఓడితే రాజీనామా చేస్తా అని చెప్పి మాట తప్పారని, తెలంగాణ కోసం మాట మీద నిలబడి రాజీనామా చేసిన చరిత్ర తనది అని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసి, రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని చెప్పానని, కానీ రుణమాఫీ కూడా సంపూర్ణంగా కాలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి ఎనిమిది నెలల ప్రయాణం మోసం%తో% రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ కూడా పూర్తిగా రుణమాఫీ చేయలేదని విమర్శించారు.

త్వరలోనే రైతుల పక్షాన బిఆర్ఎస్ కార్యాచరణ ప్రకటిస్తుందని వెల్లడించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేయలేదని తాను ప్రశ్నించానని, ఆగస్టు 15లోపు చేస్తానని మరో తేదీ చెప్పారని, ఆగస్టు 15 వరకు కూడా పూర్తి చేయలేదని అన్నారు. ప్రశ్నిస్తున్న తమపై భౌతిక దాడులకు పురిగొల్పుతున్నారని, కాంగ్రెస్ గుండాలతో తన క్యాంప్ ఆఫీసుపై దాడి చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దాడులు చేస్తే పెట్టుబడులు వస్తాయా..? తాము అధికారంలో ఉన్నపుడు దాడులు చేస్తే ఉండేవారా..? అంటూ హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

'ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో'

- సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ఈ మేరకు అయన శనివారం రాత్రి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు.శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్ కనెక్టివిటీ రూట్ మ్యాప్‌పై అధికారులు సీఎంకు వివరించారు. రూట్ మ్యాప్‌పై పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధి చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. బుద్వేల్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన సముదాయం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం కోరారు.

రోడ్, మెట్రో మార్గాలకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. వీలైనంత త్వరగా పూర్తి స్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పిన సీఎం రేవంత్ యుద్ధప్రాతిపదికన పనులు మొదలుపెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పెట్టుబడులు మాత్రమేకాకుండా రవాణా సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తేనే బహుళ జాతి సంస్థలు ముందుకొస్తాయని ఆయన అభిప్రాయపడినట్టు సమాచారం. ప్రస్తుతమున్న మెట్రోను ముచ్చర్ల వరకు పొడిగించాలని భావిస్తున్నట్టు సమాచారం.

స్వదేశానికి చేరుకున్న వినేశ్ ఫొగాట్

బలగం టీవి, హైదరాబాద్

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ శనివారం స్వదేశానికి చేరుకున్నారు. ఆమెకు గ్రాండ్ వెల్‌కం చెప్పేందుకు క్రీడాభిమానులు భారీ ఎత్తున ఢిల్లీ విమానాశ్రయానికి తరలివచ్చారు. వారిని చూసిన వినేశ్ ఫొగాట్ తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెను కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా, రెజర్లు సాక్షిమలిక్, బజరంగ్ పునియా, తదితరులు ఓదార్చారు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్‌కు చేరిన వినేశ్.. 100 గ్రాములు అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన సంగతి తెలిసిందే. కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్)లో అప్పీలు చేసినా సానుకూలంగా ఫలితం దక్కలేదు. ఆమె విజ్ఞప్తిని కాస్ కొట్టివేసింది.

వినేశ్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉదయమే ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. పారిస్ ఒలంపిక్స్‌లో రజత పతకం కోసం రెజ్లర్ వినేశ్ ఫోగట్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ తోసిపుచ్చిన విషయం తెలిసిందే. ఒలంపిక్స్‌లో తనపై వేసిన అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ చేసిన అప్పీల్‌ను కాస్ కొట్టివేసింది. ఫైనల్‌కు చేరిన తర్వాత అనర్హత వేటు వేయడంతో తనకు రజతం ఇవ్వాలని కోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టినఅడ్‌హక్ డివిజన్ తీర్పు వెల్లడించింది. ఫోగట్ చేసిన అప్పీల్‌ను కాస్ తిరస్కరించిందని ఇండియన్ ఒలంపిక్ సంఘం ప్రకటించింది. యునైటెడ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ విధించిన అనర్హతపై వినేష్ అప్పీల్‌ను కాస్ తిరస్కరించడం దిగ్భ్రాంతికి, నిరాశకు గురిచేసిందన్నారు ఇండియన్ ఒలంపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష. 100 గ్రాముల బరువు విషయంలో తలెత్తిన వివాదంపై తీర్పునకు సంబంధించిన పరిణామాలు వినేష్ కెరీర్ పరంగానే కాకుండా క్రీడా స్ఫూర్తికి సంబంధించి కూడా అనేక ప్రశ్నలు తెరపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాస్ తీర్పుపై ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ షాకయింది. ఫోగట్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. ఒలంపిక్స్‌లో అనర్హతపై ఇంకా ఎలా ముందుకెళ్లాలనుకున్నా వినేష్‌కు సాయం అందిస్తామని స్పష్టం చేసింది.

పారిస్ ఒలింపిక్స్ 2024లో అనర్హత వేటుకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్.. సోషల్ మీడియా వేదికగా ఉద్వేగభరిత పోస్ట్‌ను పంచుకుంది. పారిస్ నుంచి భారత్‌కు తిరిగొచ్చే క్రమంలో ఈ పోస్ట్ పెట్టింది. తన లక్ష్యం ఇంకా పూర్తి కాలేదని, తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుందని చెప్పుకొచ్చింది.

'ఇక్కడితో నా పోరాటాన్ని ఆపను. ప్రస్తుతం నా బ్యాడ్ టైమ్ నడుస్తోంది. కోట్లాది భారతీయులు, నా బృందం, కుటుంబం అనుకున్న లక్ష్యం పూర్తి కాలేదు. ఇకపై పరిస్థితులు మునుపటిలా ఉండవు. 2032 వరకు నాకు ఆడే సత్తా ఉందేమో అనుకుంటున్నా. కానీ భవిష్యత్ ఎలా నిర్ణయిస్తోంది తెలియదు. కానీ నమ్మినదాని గురించి పోరాటం మాత్రం ఆపను'అని ఎక్స్‌వేదికగా రాసుకొచ్చింది. కోచ్ వోలర్, టీమ్ డాక్టర్ దిన్షా పర్థీవాలా పట్టుదల వల్లే ఒలింపిక్స్ వెళ్లగలిగానని చెప్పిన వినేష్.. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

డైమండ్ లీగ్ బరిలోకి నీరజ్ చోప్రా

బలగం టీవి, హైదరాబాద్

పారిస్ ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో మెరిసిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న లుసానే డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగుతున్నాడు. ఆగస్టు 22 నుంచి ప్రారంభం కానున్న లుసానే డైమండ్ లీగ్‌లో పాల్గొంటున్నానని నీరజ్ చోప్రా శనివారం వెల్లడించాడు. కాగా, డైమండ్ లీగ్ ఫైనల్ పోటీలు సెప్టెంబర్ 14న బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరుగుతాయి. ఈ సీజన్‌లో నీరజ్ దోహా డైమండ్ లీగ్‌లో మాత్రమే ఆడాడు.

ఆ పోటీలో నీరజ్ రెండో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం ఈ మెగా లీగ్‌లో నీరజ్ ఏడు పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచే ప్లేయర్లు డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఇక ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా 89.54 మీటర్ల ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రతజ పతకం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

మరోవైపు పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 92.97 మీటర్లతో ఒలింపిక్ రికార్డు నెలకొల్పి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. తాజాగా పారిస్‌లో తన ప్రదర్శనపై నీరజ్ స్పందించాడు. పాకిస్తాన్ ఆటగాడు అర్షద్ నదీమ్‌తో నాకు మంచి పోటీ ఎదురైంది. అతడు ఆటలో ఎంతో శ్రమిస్తాడు. అతడిలో ఎంతో నైపుణ్యం ఉంది. ఈసారి ఒలింపిక్స్‌లో రెండో ప్రయత్నంలోనే నదీమ్ రికార్డు స్థాయిలో బల్లెంను విసిరి పోటీలో ఉన్న ప్రతి ఒక్కరిని ఒత్తిడిలోకి నెట్టాడు. ఆ తర్వాత నేను కూడా రెండో ప్రయత్నంలో ఈటను బలంగా విసిరాను కానీ నా శరీరం సహకరించక పోవడంతో నదీమ్ రికార్డును బ్రేక్ చేయలేక రెండో స్థానంలో నిలిచాను. ఇప్పుడు డైమండ్ లీగ్‌లో నదీమ్‌తో మళ్లి పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్నానని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు.

సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలి

- విరాట్ కోహ్లి

బలగం టీవి, లండన్

ప్రతి ఆటగాడికి కెరీర్‌లో ఒడిదొడుకులు, సవాళ్లు సహజమేనని, వాటన్నింటిని అధిగమించి ముందుకు సాగితేనే కెరీర్ విజయవంతమవుతుందని భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ సిరీస్‌లు లేకపోవడంతో కోహ్లి ప్రస్తుతం కుటుంబంతో కలిసి లండన్‌లో సందడి చేస్తున్నాడు. ఈ సందర్భంగా కోహ్లి ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. విజయాలను మాత్రమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లోనూ నిబ్బరంగా ఉండటం చాలా ముఖ్యమన్నాడు. కెరీర్‌లో ఉన్నతస్థితికి వెళ్లిన తాను కూడా ఒకానొక దశలో విఫలమై నిరాశకు గురైన సందర్భాలు ఉన్నాయన్నాడు. తన కెరీర్‌లో ఎదుర్కొన్న క్లిష్టమైన పరిస్థితులను ఈ సందర్భంగా కోహ్లి వెల్లడించాడు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడూ వాటికి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలన్నాడు. అప్పుడే మళ్లీ గాడిలో పడే అవకాశాలుంటాయన్నాడు. ఒత్తిడికి గురై చేతులెత్తేస్తే కెరీర్ అక్కడే ముగియడం ఖాయమన్నాడు.

ప్రభాస్ కొత్త సినిమా షురూ



బలగం టీవి, హైదరాబాద్

ప్రభాస్ వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. శనివారం పూజా కార్యక్రమం జరుపుకుంది. ఈ కార్యక్రమంలో డార్లింగ్ ప్రభాస్‌తో పాటు డైరెక్టర్ హనూ, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు, దర్శకుడు ప్రశాంత్ నీల్, ఇతర సినీ ప్రముఖులు సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభాస్ న్యూ లుక్ దర్శనమిచ్చాడు. ఇప్పుడు ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కాగా, ఈ సినిమా ఓ ఎపిక్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుందని సమాచారం. ఇప్పటికే ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ను ఎంపిక చేసినట్లు సినీ వర్గాల టాక్.

మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇమాన్వి కథానాయికగా పరిచయమవుతున్నది. 1940 నేపథ్యంలో నడిచే ఈ కథలో ప్రభాస్ వారియర్ పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్నారు. భారీ వ్యయంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుధీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ–మోనిక, వీఎఫ్ఎక్స్: కమల్ కన్నన్, రచన–దర్శకత్వం: హను రాఘవపూడి.

మహాశివరాత్రి కానుకగా 'జటాధర'

బలగం టీవి, హైదరాబాద్

సుధీర్‌బాబు నటించనున్న తాజా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్ ఖరారు చేశారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు శివన్ నారంగ్, ప్రేరణా అరోరా, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. చేతిలో త్రిశూలంతో పవర్‌ఫుల్‌గా సుధీర్‌బాబు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సూపర్ న్యాచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లే కథాంశమిదని, ఈ కథకు 'జటాధర' టైటిల్ పర్‌ఫెక్ట్ యాప్ట్ అని చిత్ర దర్శకుడు వెంకట్ కల్యాణ్ తెలిపారు. ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, టాప్ టెక్నీషియన్స్ పని చేయనున్నారని, త్వరలో షఉటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు.

'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' ట్రైలర్ రిలీజ్..

బలగం టీవి, హైదరాబాద్

వెంకట్ ప్రభు దర్శకత్వంలో దళపతి విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ సినిమాను సెప్టెంబర్ 5న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో తాజాగా మూవీ ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్.